ఆరు నూరైనా షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తాం..

- బీఆర్ఎస్ ప్రభుత్వం చెరుకు రైతులను నిర్లక్ష్యం చేసింది
- రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు



జగిత్యాలలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

జగిత్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్ని ఇబ్బందులు, అడ్డంకులు ఎదురైనా, ఆరు నూరైనా సరే మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం మంత్రి శ్రీధర్‌బాబు పర్యటించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల గెస్ట్ హౌజ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో ప్రధాన అంశంగా పేర్కొన్న నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. రాష్ట్రంలో చెరుకు రైతులు ఎదురుకుంటున్న సమస్యలను పరిష్కరించేందుకు గాను ఫ్యాక్టరీ పునః ప్రారంభం చేస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని మెనిఫెస్టోలో పెట్టామని వివరించారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని పూర్తి స్థాయిలో అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే ఒక కమిటీని కూడా వేసిందని, కమిటీ సభ్యులు చెరుకు రైతులతో పాటు అధికారులతో చర్చలు జరిపారన్నారు.

గతంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ నిర్వహణ చేపట్టిన యాజమాన్యంతో సమస్యను అధిగమించడానికి సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి అంశాలపై సమీక్షించి ముందుకు సాగుతున్నారన్నారు. ప్రజలు ఎన్నికల్లో మార్పు కోరారని దాని కనుగుణంగానే కాంగ్రెస్ ప్రభుత్వం నడుచుకుంటుంటుందని, పాలనలో మార్పు చేసి చూపిస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్‌లు, ధర్మపురి, వేములవాడ ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కమటాల శ్రీనివాస్, నాయకులు నందయ్య, జగదీశ్వర్, దుర్గయ్య, శోభారాణి, రాజేందర్, మన్సూర్, అంజన్ననాగరాజు, హరికృష్ణ, అశోక్, అనిత, లత ఉన్నారు.



చెరుకు ఉత్పత్తి సంఘం అధ్యక్షుడికి చెరుకు రసం అందించి దీక్ష విరమింపజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంత్రి, విప్‌లకు ఘన స్వాగతం..

జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, విప్‌లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్‌లకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. బొకేలు అందించి శాలువాలతో సన్మానించారు. కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధ్వర్యంలో అధికారులు మంత్రి, విప్‌లకు స్వాగతం పలికారు.

మంత్రికి పీఆర్‌టీయూ నాయకుల వినతి...

జీవో 317 ప్రకారం కొత్త జిల్లాల వారీగా జరిగిన ఉద్యోగ, ఉపాధ్యాయ విభజనలో బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రికి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, బోయిన్‌పల్లి ఆనంద్‌రావులు వినతి పత్రం అందజేశారు. జీవో నెం 317తో భార్య ఒక జిల్లాలో భర్త మరొక జిల్లాలో పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. స్థానికతను కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయ తల్లిదండ్రులకు, భార్య పిల్లలకు దూరమై మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి న్యాయం చేయాలని కోరగా మంత్రి స్పందించి మాట్లాడారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకవెళ్లి, ఉమ్మడి జిల్లాల ప్రకారం జోన్ల ఏర్పాటు పరిశీలించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రైతులకు మేలు జరగాలన్నదే ప్రభుత్వ అభిమతం

మల్లాపూర్: రాష్ట్రంలోని రైతులకు మేలు జరగాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ అభిమతమని, రాష్ట్రంలోని నిజాం షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీని మంత్రి శ్రీధర్‌బాబు బుధవారం సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో నిజాం షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ అంశం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పట్టుబట్టి పెట్టించారన్నారు. ఇచ్చిన హామీకి కట్టుబడి నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. కర్మాగారంలోని యంత్రాలను పరిశీలించి, ఫ్యాక్టరికి సంబంధించిన వివరాల గురించి స్థానిక అధికారులు, నాయకులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. 2015లో లే ఆఫ్‌గా ప్రకటించి మూతబడిన ఫ్యాక్టరీని తిరిగి పునరుద్ధరించేందుకు చేపటాల్సిన చర్యల గురించి అధికా రులతో చర్చించామన్నారు. రైతులు, కార్మికుల శ్రేయస్సు కోసం నిజాం షుగర్స్‌ను తప్పనిసరిగా తెరిపించి, లాభాల బాటలో పయనించేలా ముందుకెళ్తామని భరోసా కల్పించారు. రైతులు క్షేత్రస్థాయిలో వాస్తవ సరిస్థితులను తెలుపుతూ పూర్తి స్థాయిలో సహకారం అందించాలని కోరారు. ప్రజలు కోరుకున్న మార్పును చేసి చూపించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే నాలుగు హామీలను అమలు చేశామన్నారు.

2025 డిసెంబరు లోపు రైతులకు శుభవార్తను అందజేసే విధంగా పనులు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్‌లు, ధర్మపురి, వేములవాడ ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, స్థానిక కోరుట్ల ఎమ్మె ల్యే డాక్టర్ కల్వ కుంట్ల సంజయ్, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి జయేష్ రంజన్, కలెక్టర్ యాస్మిన్‌బాషా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం, నాయకులు కల్వకుంట్ల సుజిత్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, జెట్టి లింగం, గోరుమంతుల ప్రవీణ్‌కుమార్, నారాయణరెడ్డి, పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి తాళం

అద్దె చెల్లించడం లేదని యజమాని ఆగ్రహం



కార్యాలయానికి తాళం వేస్తున్న యజమాని

ఎండపల్లి, మార్చి 6: అద్దె చెల్లించడం లేదన్న కారణంతో జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల తహసీల్దార్ కార్యాలయానికి ఇంటి యజమాని బుధవారం తాళం వేశాడు. భవన యజమాని రాయిళ్ల భూమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కార్యాలయం ప్రారంభమై ఇప్పటి వరకు 14 నెలలు గడిచిందని ఇప్పటి వరకు తనకు రూ. 3లక్షల 66 వేలు రావాల్సి ఉందని వాపోయాడు. కరెంట్ బిల్లు కూడా 60 వేలు పెండింగ్‌లోనే ఉందని మీడియా ముందు తెలి పాడు. కార్యాలయానికి గంట పాటు తాళం వేయడంతో విధులకు వచ్చిన సిబ్బంది కార్యాలయం బయటే ఉండిపోవాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ బషీర్ భవన యజమానితో మాట్లాడి, ప్రభుత్వ విప్ దృష్టికి తీసు కెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో తాళం తీసాడు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రవీణ్



కేకు కట్ చేస్తున్న బోగ శ్రావణి, మహిళలు

జగిత్యాల అర్బన్, మార్చి 6: మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరముందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బోగ శ్రావణి ప్రవీణ్ అన్నారు. బుధవారం పట్టణంలోని వీకేబీ పంక్షన్ హాలులో శక్తి వందన్ అభ్యాన్ అను కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రధానీ నరేంద్ర మోదీ వర్చువల్ ఉపన్యాసాన్ని తిలకించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముందస్తు వేడుకలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి మిఠాయి పంపిణీ చేశారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు రంగు గోపాల్, మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ, పట్టణ అధ్యక్షురాలు మమత, నాయకులు ఆముద రాజు, రాజేందర్, మల్లేశ్వరీ, పద్మ, పుష్ప, మధురిమ, లక్ష్మీ, రేవ, విజయ, కవిత, సంగీత, ప్రేమలత పాల్గొన్నారు.

పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన పలువురు యువకులు బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి నేతృత్వంలో పార్టీలో చేరారు. బీఆర్ఎస్ యూత ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీకాంత్ టిల్లుతో పాటు పలువురు యువకులు బీజేపీలో చేరారు.

●జిల్లా కేంద్రంలోని బీట్ బజార్‌లో నవతరం కిట్టీ పార్టీ ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఒక చోటుకి చేరి సాంప్రదాయ దుస్తులు ధరించి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వసంత, బట్టు సంధ్య, కోటగిరి సరిత, రేవతి, అర్చన, రమ తదితరులు ఉన్నారు.

ఆత్మ గౌరవానికి అతివలే ప్రతీక

రాయికల్, ఫిబ్రవరి 6: భారతదేశంలో ఆత్మ గౌరవానికి ప్రతీకగా అతివలు నిలుస్తు న్నారని తపస్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్ రావు అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాయికల్ మండల శాఖ ఆధ్వర్యంలో అల్లీపూర్ గ్రామంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న మహిళలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజశేకర్, జిల్లా అధ్యక్షుడు భోనగిరి దేవయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకు మహేశ్వర శర్మ, జిల్లా బాధ్యులు ప్రవీణ్ రావు, మండల శాఖ అధ్యక్షులు కస్తూరి భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ధర్మపురి, మార్చి 6: మండలంలోని బూరుగుపల్లె వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్మల రాజశేఖర్ (35) అనే వ్యక్తి మృతి చెందాడు. ధర్మపురి పట్టణానికి చెందిన రాజశేఖర్ తన మిత్రుడు సిరుప బద్రీనాథ్‌తో కలిసి బైక్ పైన ధర్మపురి వైపు వస్తుండగా ఇటు నుంచి రాయపట్నం వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న బద్రీనాథ్‌కు గాయాలు కావడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కూతురు ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

వైభవంగా శివ పార్వతుల కల్యాణం

వెల్గటూర్, మార్చి 5: మహా శివరాత్రి ఉత్సవాలలో భాగంగా వెల్గటూర్ శ్రీ అమరేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శివ పార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు విద్యాసాగర్ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించిన ప్రత్యేక పీఠంపై నిలిపారు. అర్చకుల మంత్రోచ్చారణల మధ్య శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో శివ పార్వతుల కల్యాణం వీక్షించి తరించి పోయారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, శివ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల అర్బన్, మార్చి 6: రానున్న విద్యాసంవత్సరానికి గానూ హైద్రాబాద్‌లోని రామాంతపూర్, బేగంపేట పబ్లిక్ స్కూల్‌లలో ఒకటవ తరగతి నందు ప్రవేశానికి గానూ ఆసక్తిగల విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జీ నీలిమ కోరారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు. ఈనెల 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు సంబందిత ధృవ పత్రాల జిరాక్స్‌లు, పాస్ పోర్టు సైజ్ ఫొటోలు, ఇతర వివరాలతో జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో పనివేళల్లో అందించాలని తెలిపారు. జిల్లాకు ఆరు సీట్లు కేటాయించబడ్డాయని, అంతకంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామన్నారు. లంబాడి వారికి 3 సీట్లు, గోండు, నాయక్ పోడుకు ఒకటి, ఎరుకుల వారికి ఒకటి, ఇతరులకు ఒకటి చొప్పున సీట్లు కేటాయించారన్నారు.

దుబ్బరాజన్న ఉత్సవాలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సారంగాపూర్, మార్చి, 6 : దుబ్బ రాజన్న ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు బుధవారం సాయంత్రం అంకురార్పణ పుణ్యాహవచన కార్యక్రమంతో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. జాతర ఉత్సవాలు ఐదు రోజుల పాటు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఆలయ ఈవో అనూష, ఆలయ ఫౌండర్ శంకరయ్య, అర్చకులు, ఉత్సవ కమిటీ ధర్మకర్తలు కొండ్రరాం చందర్ రెడ్డి పాల్గొన్నారు.

జగిత్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం

- ●బల్దియా చైర్ పర్సన్ అడువాల జ్యోతి
- ●కౌన్సిల్ సాధారణ సమావేశానికి బీఆర్ఎస్ కౌన్సిలర్ల వాకౌట్
- ●కమిషనర్‌తో పాటు అధికారుల తీరుపై అసంతృప్తి



నూతన చైర్ పర్సన్‌ను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

జగిత్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమని బల్దియా చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. బల్దియా సమావేశ మందిరంలో బుధవారం చైర్ పర్సన్ జ్యోతి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఎజెండాలో పొందు పరిచిన 14 అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించి ఆమోదించారు. పారిశుధ్య పనుల మెరుగు కోసం 12 నూతన ఆటోల కొనుగోలుకు రూ. 120 లక్షలు, నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ సమస్యలు రాకుండా రూ. 42 లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. నూతనంగా ఎన్నికై మొదటి సమావేశానికి హాజరైన చైర్ పర్సన్‌ను కౌన్సిల్ సభ్యులు షాలువాలతో సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మున్సిపల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు.

●మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు వాకౌట్ చేశారు. ఎజెండా ప్రతులను సమయానికి ఇవ్వలేదంటూ సమావేశ మందిరానికి వచ్చి మరి అధికారుల, చైర్ పర్సన్ తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ సమావేశానికి హాజరు కాకుండానే వెనుదిరిగి వెళ్లారు.

●సాధారణ సమావేశంలో కమిషనర్ అనీల్ బాబుతో పాటు మరి కొంత మంది అధికారుల పనితీరుపై కౌన్సిల్ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. డిజీల్ బిల్లులలో అవినీతి జరిగిందని, కాంట్రాక్ట్ ఉద్యోగుల చేతుల్లోనే మున్సిపల్ పాలన సాగుతుందని, శానిటేషన్ పనులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు దుర్గయ్య, సుల్తానా, జీవన్, లలిత, సహేరా బాను, అంజుమ్, ఆసియా సుల్తానాలు ఆరోపించారు. చైర్ పర్సన్‌గా బీసీ మహిళ నూతనంగా ఎన్నికైన మొదటి కౌన్సిల్ సమావేశాన్ని బీఆర్ఎస్ కౌన్సిలర్లు వ్యతిరేఖించి సమావేశానికి హాజరుకాకపోవడం బాధాకరమని బీజేపీ ఫ్లోర్ లీడర్ అనుమల్ల కృష్ణహరి మాట్లాడారు. ఈ సమావేశంలో కమిషనర్ అనీల్ బాబు, టీపీవో శ్రీనివాస్, ఏఈ శరణ్ తేజ ఉన్నారు.

మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

జగిత్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండల అభివృద్ధికి రాజకీయాలకు, పార్టీల కతీతంగా అధికారులు, ప్రజాప్రతినిధులమంతా సమన్వయంతో సమిష్టిగా కృషి చేద్దామని ఎంపీపీ నక్క శంకరయ్య అన్నారు. బుధవారం గొల్లపల్లి ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ నక్క శంకరయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన సమీక్షలను చదివి వినిపించారు. వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు ఆయా గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న పలు ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సభదృష్టికి తెచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు ముంద స్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఎంపీటీసీ సభ్యులను కలుపుకుని గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ ఆవుల సత్తయ్య, ఎంపీడీవో రాంరెడ్డి, డీటీ వినోద్‌కుమార్, ఎంపీటీసీలు రాజన్న, లక్ష్మీగంగారెడ్డి, ధనవ్వలక్ష్మన్, ఏవో కరుణ, ఏపీఎం త్రివేణి పాల్గొన్నారు.

రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్

మల్యాల, మార్చి 6: రైతులకు ఇక నుంచి రైతునేస్తం ద్వారా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రానుందని మల్యాల, కొడిమ్యాల మండలాల వ్యవసా య అధికారులు చంద్రదీపక్, జ్యోతి పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారం, సాంకేతికతకు రైతునేస్తం కార్యక్రమంను రాష్ట్ర వ్యాప్తంగా 110 రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించగా బుధవారం మల్యాల రైతువేదికలో మల్యాల, కొడిమ్యాల మండలాల వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు. రాబోయో రోజులలో వ్యవసాయ శాస్త్రవేత్త లతో రైతులకు సలహాలు, సూచనలు అందించడానికి దోహదపడుతుందని అన్నారు. విండో చైర్మన్లు రాంలింగారెడ్డి, శోభ, ఏఈవోలు కారుణ్యకుమార్, శ్రీనివాస్, మంజుల, శ్రీనివాస్‌రెడ్డి, గ్రీష్మ, శ్రీలత, మంజుల ఉన్నారు.

చివరి ఆయకట్టు వరకు నీరందించాలి

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాలరూరల్, మార్చి 6 : రైతులకు చివరి ఆయకట్టు వరకు నీరందించాలని, రానున్న ఎండకాలంలో సాగు, తాగునీరు, యూరియా కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మంగళారపు మహేష్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జడ్పీచైర్‌పర్సన్ దావ వసంతసురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏప్రిల్, మే నెలల్లో ఎండలు అధికంగా ఉండే అవకాశం ఉందని, నియోజకవర్గంలో చూస్తే నీటికిరత ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. మిషన్ భగీరథ దండగ అని కొంత మంది నాయకులు ప్రచారం చేస్తున్నారని, మిషన్ భగీరథ పథకంతోనే వేల ట్యాంకుల నిర్మాణం చేపట్టామన్నా విషయాన్ని గమనించాలని కోరారు. మిషన్ భగీరథ క్లోరినేషన్‌పై అధికారపార్టీనాయకులు ఇష్టారీతిన మాట్లాడడం సరికాదని అన్నారు. అనంతరం సభ్యులు తమ సమస్యలపై సభలో గళమెత్తారు. ప్యాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని సభలో గళమెత్తారు. రైతులకు కీలకమైన వ్యవసాయశాఖ ఏవో మండల సభకు గైర్హాజరుకావడం ఏంటని ప్రశ్నించారు. రైతుల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యధోరణిని అవలంబిస్తున్నారని విమర్శించారు. పంట సర్వే నమోదును గ్రామాల్లోని యువతతో కూర్చున్నచోట వ్యవసాయ అధికారులు చేయిస్తున్నారని సభలో మోరపల్లి ఎంపీటీసీ గళమెత్తారు. గ్రామాల్లోకి వస్తే అధికారులు తమకు సమాచారం ఇవ్వడంలేదని అధికారిక కార్యక్రమాలకు తమకు సమాచారం ఇవ్వడంలేదని గుల్లపేట ఎంపీటీసీ దమ్మసురేందర్ సభ దృష్టికి తీసుకువచ్చారు. జాబితాపూర్‌లో వ్యవసాయ అధికారులు గోదాం నిర్మించడంలేదని దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జాబితాపూర్ ఎంపీటీసీ చిత్తారి స్వప్న సభలో ప్రస్తావించారు.

ఈకార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రవిబాబు, ప్యాక్స్ చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, సూపరిండెంట్ చౌడారపు గంగాధర్, ఎంఇవో గాయత్రి, తహసీల్దార్ రాంమోహన్, ఏఇలు సుందర్, రాజమల్లయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, జానకి, వెటర్నరీ డాక్టర్ నరేష్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం

వేములవాడ రూరల్, మార్చి 6: రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా హన్మాజిపేటలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, ఎంపీడీవో శ్రీనివాస్, చందుర్తి, జడ్పీటీసీ నాగం కుమార్, మండల పశు సంవర్ధక అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

పద్మశాలీ సేవాసంఘం ఆధ్వర్యంలో నిరసన

కొడిమ్యాల, మార్చి 6 :మండల కేంద్రంలోని అంగడి బజారులో బుధవారం సిరిసిల్ల కాంగ్రెస్ నాయకుడు కెకె మహేందర్‌రెడ్డి పద్మశాలీలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ఆయన దిష్టి బొమ్మను కొడిమ్యాల పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. అనంతరం కొడిమ్యాల ఎస్సై సందీప్‌కు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అంకం రాజేశం, సంఘం నాయకులు లక్ష్మన్, రాజుకుమార్, జనార్దన్, అశోక్, చిరంజీవి, యెస్వంత్, దేవెందర్, రాకేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నరేంద్ర మోదీ సారథ్యంలో మహిళా సాధికారత

గొల్లపల్లి, మార్చి 6: కేంద్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి కృషి చేస్తోందని, ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో వికసిత భారత్ మహిళా సాధికారత వైపు దూసుకెళ్తోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుమల్ల కృష్ణహరి పేర్కొన్నారు. బుధవారం గొల్లపల్లి ఆర్యవైశ్య సంఘం భవనంలో బీజేపీ ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కస్తూరి సత్యం ఆధ్వర్యంలో నారీ శక్తివందన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పీఎం నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి వర్చువల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో నారీ శక్తివందన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కన్వీనర్ సత్యం తెలిపారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉన్నదని, ఈ నేపథ్యంలో విజయం సాధిస్తుందని అన్నారు.

వాడిపోతున్న పండ్ల తోటలు!

నల్లగొండ జిల్లాలో బత్తాయి, నిమ్మతోటలకు నీటిగండం.. అడుగంటిన భూగర్భ జలాలు

» పంట నష్టం రూ.180 కోట్ల దాకా

» సర్కారు చొరవ చూపాలని రైతుల వినతి

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లాలో పండ్లతోటల రైతులకు నీటిగండం వెంటాడుతోంది. భూగర్భజలాల నీటిమట్టాలు రోజురోజుకీ పడిపోతుండటంతో వాటి ఆధారంగా సాగు చేసిన బత్తాయి, నిమ్మతోటలకు తీవ్ర నీటికొరత ఏర్పడింది. కనగల్లు మండలం చర్లగౌరారం, గుర్రంపోడు మండలం పోచంపల్లి సహా జిల్లావ్యాప్తంగా సుమారు 60వేల ఎకరాల్లో బత్తాయి, మరో 12 వేల ఎకరాల్లో వేసిన నిమ్మతోటలు నీరందక వాడిపోతున్నాయి. తోటలను కాపాడుకోవాలనే ఆశతో రైతులు లెక్కకుమిక్కిలిగా బోరుబావులు తవ్వుతున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఏర్పడింది. నాన్ ఆయకట్టు ప్రాంతాలైన నల్లగొండ, దేవరకొండ డివిజన్లతో పాటు, మిర్యాలగూడ డివిజన్‌లోని మెట్ట ప్రాంతాల్లో ఈ కరువు పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో దాదాపు 300 నుంచి 500 అడుగుల లోతువరకు బోర్లు తవ్వినా, నీరు కనిపించకపోవడంతో రైతాంగం నైరాశ్యంలో మునిగింది. పండ్ల తోటలను సంరక్షించుకునేందుకు రైతులు ఒక్కొక్కరు 10, 20 వరకు బోర్లు వేస్తూ ఆర్థికంగా మరింత దెబ్బతింటున్న పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లావ్యాప్తంగా బత్తాయి, నిమ్మ రైతులు సుమారు రూ.180 నుంచి రూ. 200 కోట్ల వరకు నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. చెట్లు కూడా ఎండిపోతే మరింత నష్టపోవాల్సి ఉంటుందని, 10, 15 ఏళ్ల పాటు చేసిన శ్రమంతా వృథా అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏఎమ్మార్పీ, వరద కాల్వల ద్వారా వీలైనన్ని చెరువులను నీటితో నింపితే భూగర్భజలాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా పంట నష్టపోయినా.. తోటలైనా దక్కుతాయని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సాగర్‌లో నిల్వలు లేనందున ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి నీటిని విడుదల చేయిస్తే ఆదుకున్నట్లవుతుందని, ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.



నల్లగొండ జిల్లా చిన్నఅడిశర్లపల్లిలో బోరుబావి నీళ్లు తగ్గడంతో వచ్చే కొద్దినీటిని పైపుల ద్వారా బత్తాయి చెట్లకు పోస్తున్న రైతు కూరలింగయ్య

పశువుల మేతగా వరి పొలం

కూసుమంచి: యాసంగిలో వరి సాగు చేయొద్దని అధికారులు సూచించినా చాలామంది రైతులు పాలేరు పాతకాల్వ ఆయకట్టులో వరిసాగు చేశారు. అయితే పంట చివరి దశకు వచ్చిన ప్రస్తుత సమయంలో నీరు అందకపోవడంతో వరిపొలాలు ఎండిపోతున్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్కేపల్లి, పెరికశింగారంలో వరిపొలాలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పాలేరు నుంచి నీరు విడుదల చేయాలని రైతులు మొన్నటిదాకా ఆందోళనలు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో పాతకాల్వ పరిధిలో ఎండిపోతున్న వరి పొలాల్లో రైతులు తమ పశువులను మేపుతున్నారు.

చెరువులు నింపే కార్యాచరణ చేపట్టాలి



నాకు ఆరెకరాల బత్తాయి తోట ఉంది. భూగర్భజలాలు అడుగంటడంతో గతంలో ఉన్న బోరుబావులు నీరు పోయడం లేదు. నీళ్లందక తోట వాడిపోతోంది. ఇటీవల మూడు బోర్లు వేయించాను. చివరి బోరు 500 ఫీట్లవరకు వేసినా చుక్కనీరు రాలేదు. తోట ఎండితే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం తక్షణమే ఏఎమ్మార్పీ ద్వారా చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలి.

- పోలేని యాదయ్య, బత్తాయి రైతు, పోచంపల్లి, నల్లగొండ

నీళ్లు లేక నిమ్మతోట ఎండుతోంది



నాకు రెండు ఎకరాల నిమ్మతోట ఉంది. మరో నాలుగెకరాల్లో వరి కూడా వేశాం. గతంలో నాలుగు బోర్లుంటే ఎండిపోయాయి. ఇటీవల మళ్లీ నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. నిమ్మతోట ఎండిపోతే ఎకరాకు కనీసం లక్షవరకు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని మమ్మల్ని ఆదుకోవాలి.

- సత్తిరెడ్డి, నిమ్మరైతు, చర్లగౌరారం, నల్లగొండ జిల్లా

నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు

నేడు ప్రధాని శంకుస్థాపన


హైదరాబాద్/వికారాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూ.137.76 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రంలో చేపట్టనున్న నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం మధ్యాహ్నం శంకుస్థాపన చేయనున్నారు. ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం, భువనగిరి జిల్లాలోని భువనగిరి కోట, వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండలు, హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద చేపట్టే వివిధ అభివృద్ధి పనులను మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల కింద దేశ వ్యాప్తంగా 52 పర్యాటక కేంద్రాలను ఎంపిక చేసిన కేంద్రం దాదాపు రూ.1325.76 కోట్ల వ్యయంతో ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టనుంది. ఇందులో భాగంగా ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం అభివృద్ధికి, వసతుల కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.38.90 కోట్లు కేటాయించింది. అలాగే, భువనగిరి కోట ప్రాంతంలో విశ్రాంతి భవనాలు, పార్కులు, హరితవనాల అభివృద్ధికి, కోటపైకి చేరుకునేందుకు రోప్‌వే నిర్మాణానికి తొలి దశలో రూ.56.81 కోట్లు కేటాయించింది. హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.4.05 కోట్లు కేటాయించారు. తెలంగాణ ఊటీగా ఖ్యాతి పొందిన అనంతగిరి కొండలు, అక్కడి అటవీ ప్రాంతాల్లో వసతుల కల్పనకు రూ.38 కోట్లు కేటాయించారు. ఆయా పనులు గురువారం ప్రారంభం కానున్నాయి. అనంతగిరి కొండలను ఎకో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా మొత్తం రూ.98 కోట్లతో అభివృద్ధి పనులను నాలుగు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు.

తాగునీటికి కష్టమే!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ తాగునీటి అవసరాలకే తరలించాలని మంత్రి పొన్నం తాజాగా అధికారులను ఆదేశించినా.. ఆ నీళ్లలో గరిష్ఠంగా ఏడు టీఎంసీల దాకానే వచ్చే అవకాశం ఉండటంతో పట్నంలో ఈ వేసవిలో తాగునీటికి కటకట తప్పదనే అంచనాలకు బలం చేకూరుతోంది. బుధవారం సచివాలయంలో జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు తదితర విభాగాల అధికారులతో బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కృష్ణా, గోదావరి బ్యారేజీల్లో ఉన్న నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ఎల్లంపల్లి నుంచి 10 టీఎంసీలు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్లంపల్లి నీటిని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేటకు ఇవ్వకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. నీటి సరఫరా, రంజాన్‌లో ఏర్పాట్లు, వర్షాకాలంలో ముంపు ముప్పు నివారణ చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. 2017 అనంతరం ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, నగరంలో తాగునీటికి ఇబ్బందులు లేవని మంత్రికి అధికారులు వివరించారు. వేసవితో పాటు రంజాన్ మాసంలో అవసరాల కోసం నీటి ట్యాంకర్లు 24 గంటలు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఇందుకు ఆర్థిక ఇబ్బందులుంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పొన్నం చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు తాగునీరు, ఇతరత్రా వసతులకు సంబంధించిన చర్యలు చేపట్టాలన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని వర్షాకాలంలో ముంపు ముప్పు, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యాన్ హోల్‌లు తెరిచి ఉంటే ప్రమాదకరం అని, అలాంటి చోట్ల సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయం ముందు భారీగా వరద నీరు నిలుస్తోందని అధికారులు చెప్పడంతో ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారనికి చొరవ తీసుకుంటామని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ రాక ముందే ప్రారంభించే పనులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఫైల్)



ఎల్లంపల్లి నీరొచ్చినా దాహ'మే'!

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అడుగంటుతోంది. పదేళ్లుగా ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది నీటి నిల్వలు భారీగా పడిపోయాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కాళేశ్వరం నుంచి నీటి లభ్యత కూడా లేకుండాపోయింది. ప్రాజెక్టుకు తక్షణ నీటి సరఫరాకు అనుగుణంగా ఉండే కడెం ప్రాజెక్టులో కూడా నీటి నిల్వలు అడుగంటాయి. మార్చి 2వ తేదీ లెక్కల ప్రకారం 10.48 టీఎంసీల నీరే ఉంది. ఇక 7.66 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కడెంలో ప్రస్తుతం 3.88టీఎంసీల నీరే ఉంది. ఇందులో డెడ్ స్టోరేజీ కింద 2.8 టీఎంసీలను మినహాయిస్తే ప్రాజెక్టు నుంచి ఒక టీఎంసీ మాత్రమే ఎల్లంపల్లికి తీసుకునే అవకాశం ఉంది. పైగా ఎల్లంపల్లి ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల కన్నా ఎక్కువ ఉంటేనే హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసేలా పంప్‌హౌస్‌ను ఏర్పాటు చేశారు. అంటే ఎల్లంపల్లికి కడెం నుంచి ఓ టీఎంసీ నీరు విడుదల చేసినా గరిష్ఠంగా ఏడు టీఎంసీలనే హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంటుంది. ఈ నీళ్లు మార్చి, ఏప్రిల్ మాసాల్లో హైదరాబాద్‌కు తాగునీటి అవసరాలు తీరుతాయని.. మే, జూన్ నెలల్లో మాత్రం తాగునీటికి కటకట తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాగార్జున సాగర్‌లో కూడా 515 లెవల్ వరకు నీళ్లు ఉన్నాయి. ఈ నీళ్లు మరో 5 ఫీట్ల మేర పడిపోతే హైదరాబాద్‌కు నీటి సరఫరా తగ్గొచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి

శ్రీరాంసాగరే దిక్కు

ఎండాకాలంలో హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం శ్రీరాంసాగరే ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. శ్రీరాంసాగర్‌లో 40టీఎంల నీటి నిల్వలున్నాయి. ప్రధానంగా ఇక్కడి నీటిని సాగు అవసరాలకే వాడుతున్నారు. శ్రీరాంసాగర్ నుంచి ఎల్లంపల్లికి నీటిని విడుదల చేస్తే తాగునీటి గండం నుంచి గట్టెక్కొచ్చు. అయితే ఈ విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు స్పందించకపోవడం హైదరాబాద్ వాటర్‌వర్క్స్ అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. సీఈలు, ఎస్ఈల స్థాయిల్లో చర్చకు పెట్టినా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో చలనం లేకపోవడం కలవరపెడుతోంది.

కాలుష్య నియంత్రణ బోర్డులో

అవినీతి అధికారులు

» మండిపడిన హైకోర్టు

» సుమోటోగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచన

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (టీపీసీబీ)లో అవినీతి అధికారులు ఉన్నారంటూ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పీసీబీని సంపూర్ణ ప్రక్షాళన చేసే దిశగా ఇలాంటి అధికారులపై సుమోటోగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. రంగారెడ్డి జిల్లా గగన్‌పహాడ్‌లో ఉన్న ఫ్రోస్టర్స్ అనే కంపెనీకి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ జారీచేసిన కంపెనీ మూసివేత నోటీసును హైకోర్టు కొట్టేసింది. వాటర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్) యాక్ట్ - 1988 ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరించాలని ఆ పీసీబీ అధికారి పిటిషనర్ కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీచేశారు. చట్టంలోని నిబంధన ప్రకారం ప్లాస్టిక్ వాషింగ్ యూనిట్‌కు అనుమతి అవసరం లేదంటూ ఆ కంపెనీ సమాధానం ఇచ్చింది. కంపెనీ ఇచ్చిన వివరణను పట్టించుకోకుండా, తమ నోటీసులకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని పేర్కొంటూ అధికారి క్లోజర్ ఆదేశాలు జారీచేశారు. మూసివేత ఆదేశాలను సవాల్ చేస్తూ కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. 'రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో ఇదో బాధాకరమైన విషయం. పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అవినీతి అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. పీసీబీ వ్యవస్థను పారదర్శకంగా మార్చాలి. గత ఏడునెలలుగా మేం పీసీబీ పనితీరును గమనిస్తున్నాం. కొంత మంది అధికారులు షోకాజ్ నోటీసులు ఇస్తారు.. మరి కొంత మంది అధికారులు వచ్చి ఎలాంటి సమాధానం రాలేదంటూ తుది ఆదేశాలు ఇస్తారు. సామర్థ్యం లేని అధికారులను మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయాలి' అని వ్యాఖ్యానించింది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా జారీచేసిన మూసివేత ఉత్తర్వులు చెల్లవని పేర్కొంటూ వాటిని కొట్టేసింది. ఈ పనిని వేరే అధికారికి అప్పగించి.. 15 రోజుల్లో తాజా ఆదేశాలు జారీచేయాలని స్పష్టం చేసింది. 15 రోజుల్లో తాజా ఆదేశాలు ఇవ్వకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని స్పష్టం చేసింది.

ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ రాజకీయం!

» కేటీఆర్‌కు కోదండరెడ్డి ప్రశ్న

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ పార్టీ రాజకీయం చేస్తోందని... ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అక్రమ లే అవుట్లు వేస్తుంటే నిద్రపోయారా అని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ప్రశ్నించారు. ఎల్ఆర్ఎస్‌పై ఇచ్చిన రెండు జీవోలూ గత ప్రభుత్వం ఇచ్చినవేనని, కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన ఆ జీవోల్లోనే ధరలూ నిర్ణయించారన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నపుడు అమాయక ప్రజల నుంచి డబ్బులు లాక్కునే ప్రయత్నం చేసిన కేటీఆర్.. ఇప్పుడేమో ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలంటూ చెబుతున్నారన్నారు. హౌసింగ్ బోర్డు ద్వారా పేదలకు ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కోకాపేటలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఇస్తే.. కేసీఆర్ వాటిని లాక్కుని బిల్డర్లకు ఇచ్చారన్నారు. ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటు కంపెనీకి అప్పగించేశారన్నారు. జీవో 111 పరిధిలోని భూములనూ ఆక్రమించారన్నారు. వీటన్నిటిపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీఆర్ఎస్ బలహీనపడింది

» పొత్తులతో అది స్పష్టం: నిరంజన్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా బీఆర్ఎస్ పార్టీ ఎంత బలహీనపడిందో స్పష్టమైందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీని వీడి వెళుతుండడంతో ఉనికిని కాపాడుకునేందుకు కేసీఆర్ నానా తంటాలు పడుతున్నారన్నారు. నిబద్ధత గల అధికారిగా పేరున్న ప్రవీణ్‌కుమార్‌కూ ఇది ఒక చెరగని మచ్చ అన్నారు. దళితుడిని తెలంగాణకు తొలి సీఎంగా చేస్తానని చెప్పి మాట తప్పినందుకు కేసీఆర్ పంచన చేరారా... అంటూ ప్రవీణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఏక్‌నాథ్ షిండేగా పేర్కొంటున్న కేటీఆర్.. హింసించే రాజు 23వ పులకేశి అంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్ నేత ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌ను కేసీఆర్ హోల్‌సేల్‌గా బీజేపీకి అమ్మకానికి పెట్టారన్నారు. ప్రవీణ్‌కుమార్‌ని పెంచి పోషించింది బీఆర్ఎస్ పార్టీనేనని, అది ఇప్పుడు బట్టబయలైందని అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈమేరకు మాట్లాడారు.

గాంధీభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీభవన్‌లో బుధవారం మహిళాకాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుక జరిగింది. మహిళా కాంగ్రెస్ నేతలు భారీ కేక్‌ను కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటర్ల వివరాలు ఇవ్వండి

» ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్‌ల వారీగా ఇంటినంబర్లతో కూడిన మ్యాప్ (నజ్రీ నక్ష)లను మాజీ ఎంపీ, ఆ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అందజేయాలని ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ గతేడాది జారీచేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) ప్రకారం నజ్రీ నక్ష అందజేయాల్సి ఉండగా అందుకు ఎన్నికల అధికారులు నిరాకరిస్తున్నారని పేర్కొంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో 2.40 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని.. హైదరాబాద్‌లో 1.65 లక్షల మంది వరకు ఉన్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారులు ఇంటి నెంబర్లతో కూడిన నజ్రీ నక్షలను బయటపెట్టకపోవడం వల్ల ఓటర్ల జాబితాలో అక్రమాలకు అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి వాదనలు వినిపిస్తూ.. ఫొటోలతో కూడిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఏరియాను ప్రతిబింబించే నజ్రీ నక్షను ఆయా రాజకీయ పార్టీలకు ఎన్నికల అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు. తగిన మొత్తంలో రుసుము చెల్లిస్తే పిటిషనర్‌కు నక్ష అందజేయడానికి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఖర్చులు స్వీకరించి పిటిషనర్ కోరిన విధంగా నజ్రీ నక్ష అందజేయాలని ఆదేశించింది.

సీడ్ కార్పొరేషన్‌లో సిత్రాలెన్నో!

(మొదటి పేజీ తరువాయి)

ఆర్భాటంగా ప్రకటించగా.. గడిచిన పదేళ్లలో విత్తనోత్పత్తి కాస్తా ఏటా నేలచూపులు చూస్తూ.. అథఃపాతాళానికి పడిపోయింది. విత్తనాల నాణ్యతను ధ్రువీకరించే 'సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ'లోనూ అన్నీ అవకతవకలే.! ఇక్కడ సిబ్బంది బయోమెట్రిక్ ఉండదు. ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అసలు విధుల్లోకే రారు. సంతకాలు చేయరు. తొమ్మిదేళ్లుగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ హెచ్‌వోడీగా, సీడ్ కార్పొరేషన్ ఎండీగా కె.కేశవులు పనిచేస్తున్నారు. ఈ తొమ్మిదేళ్లలో రికార్డు స్థాయిలో 28 విదేశీ పర్యటనలు చేశారు. ఏ ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ ఇన్ని విదేశీ పర్యటనలు చేయకపోవడం విశేషం. పైగా.. 2022 అక్టోబరులో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో కె.కేశవులు స్వస్థలమేది? అంటూ ఓ ప్రశ్న రావడం గమనార్హం!

గ్రో ఔట్ టెస్ట్ నిధులెక్కడ?

విత్తనాభివృద్ధి కోసం గ్రో ఔట్ టెస్ట్(జీవోటీ) ఫామ్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.50 లక్షలను మ్యాచింగ్ గ్రాంట్ కింద అందజేశాయి. రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వర్సిటీ ప్రాంగణంలో ఈ ఫామ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పుడు అక్కడ పాడుబడ్డ ఓ గేటు, చెట్ల పొదలు, ముళ్ల కంపలు తప్ప.. అక్కడ ఫామ్ లేదు. అయితే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చిన రూ.కోటి నిధులు ఎక్కడ? అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ఒక్క విత్తన గింజను ఉత్పత్తిచేయకున్నా.. యూసీలు మాత్రం సమర్పించారు. తెలంగాణను 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా చేస్తామంటూ గత ప్రభుత్వం చేసిన ప్రకటన ఆర్భాటాలకే పరిమితమైంది. లక్షల నిధులు కేటాయించినా.. విత్తనోత్పత్తి పెరగకపోగా.. సీడ్ కార్పొరేషన్‌లో పదేళ్లుగా నేలచూపులు చూస్తోంది. ఎగుమతులు క్షీణించాయి. 2014-15లో సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన విత్తనోత్పత్తి 3.18 లక్షల క్వింటాళ్లు కాగా.. 2021-21లో 1.56 లక్షల క్వింటాళ్లు, 2022-23లో 1.78 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. విత్తన పంపిణీ 2014-15లో 3.36 లక్షల క్వింటాళ్లుగా ఉండగా.. 2022-23లో అది 3.05 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీలో రిజిస్ట్రేషన్లు కూడా గణనీయంగా పడిపోయాయి. 2015-16తో పోలిస్తే.. 2022-23కల్లా ఈ రిజిస్ట్రేషన్లు 1.65 లక్షల మేర తగ్గిపోయాయి.

ఇస్టా కాంగ్రెస్‌కు ఇష్టారాజ్యంగా నిధులు

హైదరాబాద్‌లో 2019 జూన్ నెలలో 32వ ఇస్టా కాంగ్రెస్ సదస్సును నిర్వహించారు. 75 దేశాల నుంచి 451 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరైనట్లు ఇస్టా కాంగ్రెస్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించిన టీఎస్-ఎస్‌వోసీఏ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.కేశవులు అప్పట్లో వెల్లడించారు. ఈ సదస్సు నిర్వహణకు అప్పట్లో రైతుబంధు' నిధులను మళ్లించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. సుమారు రూ.10 కోట్ల నిధులను ఇస్టా కాంగ్రెస్ సదస్సుకు ఖర్చు చేశారు. ఇందులో పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలున్నాయి. మూడు రోజులకు నోవాటెల్ హోటల్ హాలు, భోజనాలకే రూ.70 లక్షల ఖర్చు రాశారు. డెలిగేట్స్ గదులకు రూ.25 లక్షలు, స్టాల్స్ ఏర్పాటుకు రూ.43.12 లక్షలు, కార్నివాల్ ఏర్పాట్లకు రూ.20.37 లక్షలు, తాజ్ హోటల్స్‌లో ఫుడ్ అండ్ బేవరేజెస్‌కు రూ.26.34 లక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.25.65 లక్షలు, ప్రచారానికి రూ.12 లక్షలు, హైటెక్స్‌లో స్టేజీ ఇతరత్రా ఏర్పాట్లకు రూ.20 లక్షలు, ఇస్టా వీడియో ఫిల్మ్‌లకు రూ.18 లక్షలు, ఎగ్జిబిటర్లు, అధికారుల ఫీజులకు రూ.52.75 లక్షలు, రైతుల సమావేశానికి రూ.56 లక్షలు, చిల్లర ఖర్చులకు రూ.15 లక్షలు వెచ్చించారు. చివరకు నోడల్ ఆఫీసర్ కేశవులు ఐ-ఫోన్ కోసం రూ.65 వేలను ఈ నిధుల్లోంచే ఖర్చుచేశారు. హైదరాబాద్‌లోని పలు స్టార్‌హోటళ్ల పేరుతో విచ్చలవిడిగా బిల్లులను సమర్పించారు. దీనిపై అప్పట్లో విమర్శలు వచ్చినా.. నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు.

జీతం ఇక్కడ.. చేసేది ఆర్డర్లీ

సీడ్ సర్టిఫికేషన్‌లో ఉద్యోగంలో చేరిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది.. విధులకు హాజరవ్వడం లేదు. బయోమెట్రిక్ వేయటం లేదు. ఒకరేమో హైదరాబాద్ లంగర్‌హౌస్‌లో నివాసముంటున్న ఏపీ మాజీ సీఎస్ ఇంట్లో పనిచేస్తున్నారు. మరొకరు ఆ మాజీ ఐఏఎస్ ఇంటిపక్కనే ఉండే సీడ్ కార్పొరేషన్ ఎండీ ఇంట్లో ఊడిగం చేస్తున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏడాదికోసారి తెల్లకాతాలపై సంతకాలు చేసి పంపుతున్నట్లు.. దాన్నే రెన్యువల్ ఆఫ్ సర్వీసెస్‌గా అధికారులు రికార్డుల్లో పెడుతున్నట్లు తెలుస్తోంది.

ప్రైవేటు ఏజెన్సీలతోనే ఆడిటింగ్

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ సంస్థకు సంబంధించిన ఆడిట్‌ను ఏటా ప్రైవేటు ఏజెన్సీలతోనే చేయించారు. ఒక 2021-22లో మాత్రమే ఏజీ ఆడిట్ జరిగింది. ఆర్‌కేవీవై పథకంలో వరంగల్‌లో ఆఫీస్ బిల్డింగ్ పూర్తిగా నిర్మించకుండానే రూ.95 లక్షలకు యూసీలు సమర్పించినట్లు తెలుస్తోంది. మినీ బస్ కొనుగోలు, సబ్-మిషన్ ఆఫ్ సీడ్స్ అండ్ ప్లాంటింగ్ మెటీరియల్ నిధుల మళ్లింపు, వాహనాల నిర్వహణ, వ్యవసాయశాఖ కార్యదర్శి కార్యాలయంలో పనిచేసే టెక్నికల్ సిబ్బందికి వేతన చెల్లింపులు, ఈపీఎఫ్-ఈఎస్ఐ కాంట్రిబ్యూషన్, కాకాని కన్సల్టెన్సీకి చేసిన చెల్లింపులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సీడ్ టెస్టింగ్ ల్యాబ్ పేరుతో ఆర్‌కేవీవై నిధుల మళ్లింపులో జరిగిన అవకతవకలు ఏజీ ఆడిట్‌లో వెలుగుచూశాయి. మిగిలిన సంవత్సరాల్లో చిట్టిబాబు అండ్ కంపెనీ, సుబ్రమణ్యం అండ్ కంపెనీ అనే ఏజెన్సీలతో ఆడిట్ చేయించారు. అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకే ప్రైవేటు ఏజెన్సీలతో ఆడిట్ చేయించినట్లు ఆరోపణలున్నాయి.

మహాశివరాత్రికి రాజన్న ఆలయం ముస్తాబు

పెగడపల్లి, మార్చి 6 : మండల కేంద్రంలోని స్వయం భూ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. బుధవారం నుంచి శనివారం ఈ నెల 9 వరకు జాతర ఉత్సవాలు జరుగనుండగా ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు చలువ పందిల్లు వేయించి, ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. బుధవారం గౌరిగణపతి పూజ, స్వస్థి పుణ్యాహవచనంతో ఉత్సవాలు ప్రారంభం కాగా 7న గురువారం అగ్ని ప్రతిష్ఠ స్థాపిత దేవతా హవనములు, సాయంత్రం 4 గంటలకు సామూహిక కుంకుమ పూజలు, 8న శుక్రవారం ఉదయత్పూర్వం 5 గంటల నుంచి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సామూహిక అభిషేకములు, రాత్రి 9 గంటలకు శివపార్వతుల కళ్యాణ మహోత్సవం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ దర్శనము, బిల్వ పత్ర సమర్పణ, 9న శనివారం స్వామి వారి గ్రామ సందర్శనము, శోభాయాత్ర, రుద్ర హోమం, రథోత్సవం, అన్నపూజ అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు గుండి శ్రీనివాస శర్మ తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ



నీలం రవి

మల్యాల, మార్చి 6: మల్యాల పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నీలం రవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నెల రోజుల క్రితమే బాధ్యతలు చేపట్టిన సీఐ దామోదర్‌రెడ్డి బదిలీ కాగా ఏసీబీలో విధులు నిర్వహిస్తున్న నీలం రవి ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టారు. సీఐని మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి ఎస్సైలు అబ్దుల్ రహీం, సందీప్, రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. సీఐ రవి మాట్లాడుతూ మల్యాల, కొడిమ్యాల పోలీస్ స్టేష న్‌లో ఎస్సైగా పని చేసిన అనుభవంతో అందరి సహకారంతో శాంతి భద్రతలకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

మెట్‌పల్లి సీఐగా..

మెట్‌పల్లి: మెట్‌పల్లి సీఐగా నవీన్ బుధవారం బాధ్యతలను చేపట్టారు. మెట్‌పల్లి సీఐగా విధులు నిర్వహించిన లక్ష్మీ నారాయణ మల్టీ జోన్ వన్ హైదరాబాద్ ఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రామగుండం సీఎస్బీ లో పని చేస్తున్న నవీన్‌ను మెట్‌పల్లి సీఐగా బదీ లు చేశారు. సీఐ నవీన్‌కు మెట్‌పల్లి ఎస్సై చిరం జీవి సిబ్బందితో కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

కమిషనర్ తిరుపతి

కోరుట్ల, మార్చి 6 : పట్టణంలో వచ్చే వేసవిలో నీటి సమస్య తలెత్త కుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి సూచించారు. బుధవారం పట్టణంలోని ఫిల్టర్ బెడ్, వివిధ వార్డులో ఏర్పాటు చేసిన బోర్లను పరిశీలించారు. వార్డులలో ఉన్న నీటి వనరుల గురించి తెలుసుకోని తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. నీటి వనరులు అవసరాలను ప్రత్యేక ప్రణాళికను రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఏఈ లక్ష్మి ఫిట్లర్స్, లైన్‌మన్‌లు పాల్గొన్నారు.

ఎంపీ నిధుల ప్రొసీడింగ్స్ అందజేత

కోరుట్ల రూరల్, మార్చి 6: మండలంలోని వివిధ గ్రామాల్లోని కుల సంఘాలకు ఎంపీ నిధుల నుంచి మంజూరైన ప్రొసిడింగ్ పత్రాలను బుధవారం జిల్లా బీజేపీ అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ అందజేశారు. మండలంలోని జోగినిపల్లిలోని గంగపుత్ర సంఘానికి రూ. 4 లక్షలు, వెంకటాపూర్ గ్రామంలోని మహిళ సంఘ భవన అభివృద్ధికి రూ. 4 లక్షలు, యూసుఫ్‌నగర్ గ్రామ పద్మశాలి సంఘ భవన అభివృద్ధికి రూ.3.50 లక్షలు, అయిలాపూర్ పద్మశాలి సంఘ భవన అభివృద్ధికి రూ. 4లక్షలు, మోహన్‌రావుపేట పద్మశాలి సంఘ భవన అభివృద్ధికి రూ.3.50 లక్షలు ప్రొసిడింగ్ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు, చిన్నమెట్‌పల్లి ఎంపీటీసీ సభ్యుడు పంచరి విజయ్‌కుమార్, యూసుఫ్‌నగర్ గ్రామ మాజీ సర్పంచ్ తుక్కారాం గౌడ్, వెంకటాపూర్ మాజీ సర్పంచ్ తోట లింగారెడ్డి పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి: ఎస్సై సందీప్

కొడిమ్యాల, మార్చి 6 : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కొడిమ్యాల ఎస్సై సందీప్ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని తిర్మలాపూర్‌లో సైబర్‌మోసాలు, మూఢనమ్మకాలు, ఆత్మహత్యల నివారణ, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజెంట్ల మోసాలు నివారణపై ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాలతో పోలీస్ కళాబృందం సభ్యులు అవగాహన కలిపించారు. ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానాస్ప దంగా తిరుగుతున్న వ్యక్తుల గురించి 100 డయల్‌కు చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు కమల్, రమేష్, సత్తయ్య, సతీష్, కాంతయ్య, డప్పు లక్ష్మన్, హన్మంతు, సందీప్‌రావు, ఎంపీటీసీ మహేష్, మల్లేశం యాదవ్, హరేందర్, ప్రజలు పాల్గొన్నారు.

మరోమారు మోదీ పాలన కోరుకుంటున్నారు

జిల్లా బీజేపీ అధ్యక్షుడు సత్యనారాయణ

కోరుట్ల, మార్చి 6 : దేశ ప్రజలు మరోమారు నరేంద్ర మోది పాలన కోరుకుంటున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాల యంలో కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్ చెట్టుపల్లి సుఖేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శక్తి వందన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పాల్గొన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను మహిళలకు ప్రొజెక్టర్ సహాయంతో వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రతినిధి రాజు జాదవ్

కథలాపూర్, మార్చి 6: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రతినిది రాజు జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు వివిధ పాఠశాలలో పీఆర్‌టీయు సభ్యత నమోదు కార్యక్రమం టీపీసీసీ అధికార ప్రతినిది హర్షవర్దన్ పిలుపు మేరకు పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు గాదే నర్సింగరావు, పీఆర్‌టీయు కార్యదర్శి నర్సయ్య ఆద్వర్యంలో రాష్ట్ర ప్రతినిది రాజు జాదవ్ పర్యవేక్షణలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

సభా సంఘానికి స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు

కోరుట్ల, మార్చి 6 : రాష్ట్ర ప్రభుత్వం షుగర్ కర్మాగారాల అధ్యయనానికి ఏర్పాటు చేసిన సభా సంఘానికి బుధవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ నియోజవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగ రావు, సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, వార్డు సభ్యులు ఆడెపు కమల-మధులు ఘన స్వాగత పలికారు. కోరుట్ల నియోజకవర్గంలోని ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరి సందర్శనకు వచ్చిన మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలకు స్వాగతం పలికారు. రాష్ట్ర మంత్రిగా ప్రమాణం చేసి మొదటి సారిగా నియోజకవర్గం విచ్చేసిన శ్రీదర్ బాబుతో పాటు విప్‌లు, ఎమ్మెల్సీలను సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, పెరుమాండ్ల సత్యనారా యణ, మహిపాల్ రెడ్డి, అమరేందర్, రిజ్వాన్, నహీం, ఏంబేరి నాగభూషణంలతో పాటు పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

జగిత్యాల టౌన్, మార్చి 6 :కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు లవంగ రాజేందర్‌తో మరి కొంత మంది కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్సీ కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కార్యకర్తలు అంకిత భావంతో పనిచేయాలని ఎమ్మెల్సీ కోరారు. ఈ కార్యక్రమంలో రాజేశం తదితరులు ఉన్నారు.

రైతు నేస్తంను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా అడిషనల్ కలెక్టర్ దివాకర

ఇబ్రహీంపట్నం, మార్చి 6: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ దివాకర కోరారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి విడియో కాన్ఫరెన్స్ ద్వార రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ దివాకర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు నేస్తం శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోని నూతన వ్యవసాయ పద్దతులు అవలం భించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయధికారి బి.వాణి, వ్యవసా యధికారులు రమేష్, దీపిక పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ఫీజు రద్దు చేయాలి

జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆందోళనలు



జగిత్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జగిత్యాల టౌన్, మార్చి 6 :ఎల్ఆర్ఎస్ ఫీజు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు జగిత్యాలలో బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీంలో భాగంగా భూముల క్రమబద్దీకరణ కార్యక్రమంలో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఎలాంటి ఫీజులు లేకుంగా ఉచితంగా చేపడుతామని హామీలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన అనంతరం ఇచ్చిన హామిని మరిచి లక్షలాది రుసుమును చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టడం తగదన్నారు.

జగిత్యాలలోనే 8 వేలకు పైగా దరఖాస్తులు ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్దీకరణ కోసం పెండింగ్‌లో ఉన్నాయ న్నారు. తక్షణమే ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్దీకరణ కో సం విధించిన ఫీజు విధానాన్ని ఉపసంహరించి ఉచి తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లే అవు ట్ ప్రకారమే నిర్మాణాలు కొనసాగించడంతో పాటు మాస్టర్ ప్లాన్‌ను అమలులోకి తీసుకరావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కమిషనర్ అనీల్ బాబుకు అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు శివకేసరి బాబు, కూతురు రాజేష్, ధర్మరాజు, రాము, నవీన్, శ్రీకాంత్, నాయకులు వొళ్లం మల్లేశం, ఆనందరావు, రాజ్ కుమార్, సురేష్, గిరి, శ్రీనివాస్, జగన్, శంకర్ ఉన్నారు.

ధర్మపురి: ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలోని కమలాపూర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు బుధవారం రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. కార్యకర్తలు జాతీయ రహదారిపై బైఠాయించి, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. నేతలు మాట్లాడుతూ ధర్మపురి పట్టణంలో ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్దీకరణకు అనేక దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలో భాగంగా ఉచితంగా ఎల్ఆర్ఎస్ అమలు చేయాలని, లే అవుట్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ ఉదయ్‌కుమార్ పోలీస్ సిబ్బందితో చేరుకుని బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్యమ్మ, వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్ కుమార్, వైస్ ఎంపీపీ గడ్డం మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మొగిలి శేఖర్, పట్టణ అధ్యక్షులు ఆకుల రాజేష్ పాల్గొన్నారు.

కోరుట్ల : తెలంగాణ సంక్షేమం మరిచి పరిపాలన చేస్తుంది రాష్ట్ర ప్రభుత్వమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. మున్సిపల్ కమిషనర్ తిరుపతికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జిందం లక్ష్మినారాయణ, పేర్ల సత్యం, గందం గంగాధర్ దారిశెట్టి రాజేష్, బాస్కర్‌రెడ్డి, సందయ్య, నర్సరెడ్డి, రాజనర్సులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల సంక్షేమాన్ని పట్టించుకుంటలేదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. ఎల్ఆర్ఎస్ ఫీజు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత- సత్యనారాయణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు బుధవారం శాస్త్రీ చౌరస్తాలో నిరసన చేపట్టారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టి కమిషనర్ మోహన్‌కు వినతి ప్రతం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మొరపు గంగాధర్, బంగారు కాళ్ల కిషోర్, గంగాధర్, మన్నేఖాన్, నాయకులు ఓజ్జెల శ్రీనివాస్, జావిద్, హన్మండ్లు, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.



కోరుట్ల కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే



ధర్మపురిలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రహదారిని మళ్లిస్తే ఆత్మహత్యలే శరణ్యం

● ఎన్‌హెచ్-63పై బాధిత రైతుల ధర్నా



రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

జగిత్యాలరూరల్, మార్చి 6: ఎన్‌హెచ్-63 బైపాస్ రోడ్డు 3ఏను పబ్లిష్ అయిన విధంగానే ఏర్పాటు చేయాలని, రహదారిని మళ్లిస్తే ఆత్మహత్యలే శరణ్యమని బాధిత రైతులు వాపోయారు. జగిత్యాల మండలం తిప్పన్నపేట పెద్దపులివాగు వద్ద ధర్మపురి జాతీయ రహదారిపైన తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట రైతులు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ ఎన్‌హెచ్-63 బైపాస్ రోడ్డు 3ఏను కొంతమంది నాయకుల ఒత్తిడికి తలొగ్గి రహదారి నమూనాను మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రహదారిని కొంతమంది స్వార్థం కోసమే మళ్లించేందుకు అధికారులపై ఒత్తిడి తెచ్చారన్నారు. కేవలం తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట గ్రామాల్లోనే రహదారి అలైన్‌మెంట్ మార్చడం ఏమిటని అధికారులను బాధిత రైతులు ప్రశ్నించారు. చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయమే జీవనాధారంగా సాగు చేసుకుంటున్న భూములను బైపాస్ రోడ్డు విస్తరణలో కోల్పోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. రహదారిని మళ్లిస్తే ఆత్మహత్యలే శరణ్యమని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. సుమారు అరగంటపాటు రైతులు ధర్నా చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ సంఘటనస్థలానికి చేరుకొని రైతులకు నచ్చచెప్పడంతో ధర్నా విరమించారు.

దారిమళ్లింపు పై నిరసనగా వంటావార్పు

జగిత్యాల మండలంలోని తిప్పన్నపేట-గోపాల్‌రావుపేట గ్రామాల మీదుగా వెళ్తున్న ఎన్‌హెచ్-63 బైపాస్ నేషనల్ హైవేను దారి మళ్లించడాన్ని నిరసిస్తూ జగిత్యాల మండలంలోని తిప్పన్నపేట శివారులోగల పెద్దపులివాగు వద్ద బాధిత రైతుల బుధవారం రాత్రి వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. తమకు న్యాయం జరిగే వరకు అక్కడే నిద్రించి తమ నిరసన తెలుపుతామని హెచ్చరించారు. అధికారులు న్యాయం చేయాలని కోరారు. ఎన్‌హెచ్-63 బైపాస్‌రోడ్డు 3 ఏ పబ్లిష్ అయిన ప్రకారంరోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు.

రేణుక ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవం



తాటి చెట్టు నుంచి కల్లు తెస్తున్న గౌడ సంఘ నాయకులు

కోరుట్ల, మార్చి 6: పట్టణంలోని మాదాపూర్ కాలనీ సమీపంలో రేణుక ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవం బుధవారం గౌడ సంఘ నాయకుల అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పోత రాజులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. రేణుక ఎల్లమ్మకు గౌడ సంఘ ఆధ్వర్యంలో బోనాల జాతర నిర్వహించారు. బోనాల ఊరేగింపు పట్టణంలోని జాతీయ రహదారిపై అంబేద్కర్ చౌరస్తా, సాయిబాబా దేవాలయం నుంచి రేణుక ఎల్లమ్మ దేవాలయం వరకు సాగింది. పోతరాజుల నృత్యాలు అకుట్టుకున్నాయి. మహిళలు బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గీత కార్మికులు తాటి చెట్టు నుంచి కల్లు గీసి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ అన్నం లావణ్య, సంఘ నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

జగిత్యాల రూరల్, మార్చి 6: జగిత్యాల అర్బన్ మండలం మోతెలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని బుధవారం ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మహేష్, ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సురకంటి స్వప్నరాజేశ్వర్‌రెడ్డి, అంబేద్కర్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

హక్కులు వినియోగించుకోవాలి

మల్యాల, మార్చి 6: మహిళలు తమకు ప్రభుత్వాలు కల్పించిన హక్కులను వినియోగించుకోవాలని అంగన్‌వాడీలు సూచించారు. మండలంలోని రామన్నపేట అంగన్‌వాడీ కేంద్రం-1లో బుధవారం ముందస్తు మహిళ దినోత్సవం నిర్వహించారు. మహిళలకు తమ హక్కులు, ప్రభుత్వ పాఠశాలలోని కిశోర బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు ఎదుర్కొనే అన్యాయాలు, సమస్యలు, వేధింపులపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ డెస్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ రేణుక పాల్గొన్నారు.

సబ్ కమిటీకి కాంగ్రెస్ శ్రేణుల స్వాగతం

మెట్‌పల్లి రూరల్, మార్చి 6 : ముత్యంపేట నిజాం చక్కెర ఫ్యాక్టరీ పునరుద్దరణ కోసం క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐటీ, పరిశ్రమల, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్‌బాబుతో పాటు సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. బుధవారం మండలంలోని వేంపేట మీదుగా వెళ్తుండగా మంత్రితో పాటు సబ్ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు గజమాలలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు గోరుమంతుల ప్రవీణ్, మామిడి నారాయణరెడ్డి, లింగం పాల్గొన్నారు.

అంజన్నను దర్శించుకున్న అడిషనల్ కలెక్టర్

మల్యాల, మార్చి 6: జగిత్యాల అడిషనల్ కలెక్టర్ రాంబాబు బుధవారం కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకున్నారు. నూతనంగా నియమితులైన అడిషనల్ కలెక్టర్ బాధ్యతలు చేపట్టే ముందు అంజన్నను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ అధికారులతో పాటు ఏఎస్సై చిలుక శ్రీనివాస్ ఉన్నారు

ఆయిల్ పాం పంట పరిశీలన

కథలాపూర్, మార్చి 6 : మండలంలోని గంబీర్‌పూర్ గ్రామ శివారులోని వ్యవసాయ క్షేతంలో సాగు చేస్తున్న అయిల్‌పాం పంటను మండల వ్యవసాయ అధికారి యోగిత బుధవారం పరిశీలించారు. అయిల్ పాం సాగు కోసం ఆసక్తి గల రైతులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు సుస్మశ్రీ రైతులు పాల్గొన్నారు.

అంజన్న దుకాణాల సముదాయానికి టెండర్లు

మల్యాల, మార్చి 6: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో దిగువ కొండగట్టులో గల దుకాణాల సముదాయానికి అధికారులు బుధవారం టెండర్లు నిర్వహించారు. దుకాణాల సముదాయంలో 15 గదులు ఉండగా ఒక్కటి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉండగా మిగితా 14కు ఏడాది కాలపరిమితికి గాను టెండర్లు నిర్వహించగా రెండింటివి వాయిదా పడ్డాయి. టెండర్లు జరిగిన వాటి ద్వారా దేవస్థానానికి ఐదు లక్షల27 వేల 850 ఆదాయం వచ్చింది.

ఇసుక ట్రాక్టరు పట్టివేత

ఇబ్రహీంపట్నం, మార్చి 6: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామానికి చెందిన రాపాని రమేష్ గోదావరి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా గోధుర్ గ్రామశివారులో పట్టుకున్నట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

మల్లాపూర్, మార్చి, 6 : మల్లాపూర్ మండల సర్వసభ్య సమావేశంలో కోరం సభ్యులు లేక పోవడంతో వాయిద వేసినట్లు ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కాటిపల్లి సరోజన-అదిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉందన్నారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభా వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్వర్యంలో సభ కమిటీ సందరించడం జరిగిందన్నారు. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనడంతో కోరం హాజరు కానందున సమావేశాన్ని వాయిద వేయడం జరిగిందని ప్రకటన ద్వారా తెలిపారు.

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రం అందజేత



ఆహ్వానపత్రం అందిస్తున్న సభ్యులు

మెట్‌పల్లి, మార్చి, 6 : మెట్‌పల్లి పట్టణంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో నిర్వహించే కార్యక్రమాలకు హాజరు కావాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావులకు ఆహ్వాన ప త్రాన్ని స్వర్ణకార సంఘం అధ్యక్షుడు నాంపల్లి సింహాద్రి నేతృత్వంలో నాయకులు అందజేశారు.

బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారిని కలిసి పట్టణంలోని ఆలయంలో నిర్వహించే శివ పార్వతి కల్యాణంలో పాల్గొనాలని ఆహ్వాన పత్రాన్ని అందజే శారు. మెట్‌పల్లి సీఐ నవీన్, ఎస్సై చిరంజీవిలకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దురిశెట్టి నటరాజ్, ఉపాధ్యక్షుడు గిరిధర్, కోశాధికారి నాంపల్లి సంజీవ్, సహకార్యదర్శి కోటగిరి సంతోష్, నాయకులు, పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం



పనులను ప్రారంభిస్తున్న జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల రూరల్, మార్చి 6 : గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. బుధవారం మండలంలోని కల్లూర్ గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారమం జూరైన సీసీ రోడ్డు నిర్మాణం పనులను పరిశీలన జరిపి మరో రోడ్డు పనులను గ్రామస్థులతో కలిసి ప్రారంభించారు. జువ్వాడి కృష్ణా రావు మాట్లాడారు. రాష్ట్రం ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు పరిచి ప్రజలకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ స భ్యురాలు లత-రమేష్, నాయకులు పెరుమాండ్ల సత్యనారాయణ, కొంత రాజం, వెంక టేష్, నర్సయ్య, నారాయణ, రసూల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇరు గ్రామాల మధ్య సరిహద్దు వివాదం

●పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన వివాదం

●మహా శివరాత్రి జాతర ఏర్పాట్లపై నెలకొన్న సందిగ్ధత



ఇరు గ్రామాల ప్రజలతో మాట్లాడుతున్న సీఐ

రాయికల్, ఫిబ్రవరి 6: రాయికల్ మండలం కొత్తపేట గ్రామ శివారులోని శ్రీ రాజరాజేశ్వర స్వామి నాగాలయం సరిహద్దు వివాదానికి తెర లేచింది. కొత్తపేట గ్రామం నుంచి విడిపడి కొత్త జీపీగా ఏర్పడిన శివాజీనగర్ (ఒడ్డెర కాలనీ) గ్రామస్థులు దేవాలయం బోర్డు మీద శివాజీనగర్ పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. దీంతో ఇరు గ్రామాల మధ్య కొన్ని రోజులుగా వివాదం నడుస్తుంది. బుధవారం సమస్యను పరిష్కరించాలని తలచి ఇరు గ్రామస్థులతో చర్చించాలని అధికారులు నిర్ణయించగా ఇరు గ్రామాల ప్రజలు ఒకరిని ఒకరు దూషించుకుంటూ పరస్పర దాడులకు దిగేందుకు యత్నించగా జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ ఖాన్, ఎస్సై అజయ్, తహసీల్దార్ మహ్మద్ అబ్దుల్ ఖయ్యూంలు చేరుకుని గ్రామస్థులను చెదరగొట్టారు. అందరిని ఒక చోటుకు పిలిచి సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు ప్రయత్నించారు. నాగాలయం బోర్డుపై కొత్తపేటతో పాటు శివాజీనగర్ పేరు పెట్టాలని కొత్త గ్రామ పంచాయతీ శివాజీనగర్ వాసులు అధికారులకు తెలుపగా పాత పద్ధతి ప్రకారమే కొత్తపేట ఉండాలని కొత్తగా ఏమి మార్చవద్దని కొత్తపేట గ్రామస్థులు తేల్చి చెప్పడంతో ఇరు గ్రామాల ప్రజల సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. రెండు గ్రామాల మధ్య నెలకొన్న వివాదం వల్ల ఆలయంలో మహా శివరాత్రి జాతర ఏర్పాట్లపై పడింది. ఇరు గ్రామాల వ్యవహారం వల్ల మహా శివరాత్రి జాతర నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా అధికారులు పూర్తి స్థాయి చర్యలు చేపట్టి వివాదం సమసిపోయేలా చూడాలని భక్తులు కోరుతున్నారు. ఈ సందర్భంగా సీఐ ఆరిఫ్ ఖాన్ ఆయా గ్రామస్థులనుద్దేశించి మాట్లాడుతూ కొత్త బోర్డు ఏర్పాటు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని, గ్రామస్థులు అంతా సామరస్యంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.